సాక్షి
వికారాబాద్
మంగళవారం ၊ 28 ၊ మార్చి ၊ 2023



చక్రస్నానం సర్వపాప హరణం

కొడంగల్‌లో బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి చక్రస్నానం నిర్వహించారు. 8లో▸




తాండూరు అభివృద్ధి పట్టదా?

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తాండూరు అభివృద్ధికి శాపంగా మారారని బీజేపీ నేత మురళీకృష్ణ గౌడ్ అన్నారు. 8లో▸



ఇవేం 'పర్మిట్' రూంలు!

అడ్డగోలుగా పర్మిట్‌రూమ్‌లు.. పరిమితికి మించి మద్యం విక్రయాలు.. అంతకు మించి మద్యం ప్రియుల సిట్టింగ్. 9లో▸



న్యూస్‌రీల్

కుల్కచర్లలో 4 కరోనా కేసులు



కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా పరీక్ష చేస్తున్న సిబ్బంది

కుల్కచర్ల: మండలంలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 25 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. అందులో నలుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు మండల వైద్యాధికారి మాధురి తెలిపారు. కరోనా వ్యాప్తి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జన సమూహ ప్రాంతాలలో మాస్కులు ధరించాలని అదేవిధంగా జనసమర్ధ ప్రాంతాలలో ఎక్కువగా ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలో మూడురోజుల్లో కరోనా బాధితుల సంఖ్య పదికి చేరింది.

సీసీరోడ్ల నిర్మాణాల్లో అవకతవకలు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు



కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిగి: సీసీరోడ్ల నిర్మాణాల్లో అధికారపార్టీ సర్పంచ్‌లు అవకతవకలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ ఆరోపించారు. ఈ మేరకు పలు గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులతో కలిసి సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. గతంలో చేసిన సీసీరోడ్ల పనులను ఈఏడాది చేసినట్లు బిల్లులు చేయిస్తున్నారన్నారు. కాంగ్రెస్ సర్పంచ్‌లుగా ఉన్న గ్రామాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రాకుండా చేస్తున్నారన్నారు. అధికార పార్టీ సర్పంచ్‌లు ఉన్న గ్రామాలకు రూ. 30 లక్షల వరకు నిధులు ఇస్తే.. వేరే పార్టీ సర్పంచ్‌లుగా ఉన్న గ్రామాలకు నిధులు మంజూరు చేయడంలేదన్నారు. ఇటీవల ఉత్తమ గ్రామ పంచాయతీలను ఇష్టానుసారంగా ఎంపికచేశారన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయులు చిన్ననర్సింహులు, ఆంజనేయులు, రాజాపుల్లారెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సల్బత్తాపూర్ అర్చకుడికి నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న భానుప్రకాష్

బంట్వారం: మండల పరిధిలోని సల్బత్తాపూర్‌కు చెందిన అర్చకుడు భానుప్రకాశ్ నంది అవార్డు అందుకున్నారు. ఉగాది పురస్కారాల్లో భాగంగా భానుప్రకాశ్ వైదికపురోహిత రత్న నంది అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన జంగం రాజశేఖర్ స్వామి నంది అవార్డు అందుకోవడంతో సోమవారం గ్రామస్తులు సన్మానించారు.

'నేర రహిత సమాజాన్ని నిర్మిద్దాం'

షాద్‌నగర్‌రూరల్: నేర రహిత సమాజ నిర్మాణంకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏసీపీ కుషాల్కర్ అన్నారు. సాయిబాబ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో సోమవారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, దోపిడీలను అరికట్టవచ్చని అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు.



వికారాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారిపై వాహనదారుల అవస్థలు

రోడ్లు ఇరుకు.. సమస్యలతో బెరుకు

జిల్లా కేంద్రమైన వికారాబాద్ పట్టణంలో అడ్డగోలుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రహదారులను సైతం ఆక్రమించి నిర్మిస్తున్నారు. ఫలితంగా దారులన్నీ ఇరుకుగా మారుతున్నాయి. 'మాస్టర్ ప్లాన్' అమలు చేయాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఎక్కడపడితే అక్కడ భవంతులు వెలుస్తున్నాయి. సుమారు 80 వేలు జనాభా ఉన్న పట్టణంలో మౌలిక వసతులు, రోడ్లు, సుందరీకరణ వంటి పనులు సైతం కానరావడంలేదు. శాటిలైట్ టౌన్‌గా ఎంపికైనా నేటికీ కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.

వికారాబాద్‌లో మాస్టర్ ప్లాన్ ఏమాయె?

- జిల్లా కేంద్రంగా మారినా కానరాని మౌలిక వసతులు
- పట్టణంలో ఇష్టానుసారంగా నిర్మాణాలు
- రహదారులపైనే చిరువ్యాపారాలు
- కలగా మారిన శాటిలైట్ టౌన్
- హామీలకే పరిమితమైన నాయకులు
- దృష్టిసారించని పాలకులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటికీ ప్రణాళిక లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పదిహేను ఏళ్ల క్రితం పట్టణం ఎలా ఉందో ఇప్పుడూ అలానే ఉందంటున్నారు పట్టణ ప్రజలు. 2009లోనే వికారాబాద్ పట్టణం శాటిలైట్ టౌన్‌గా ఎంపికైంది. దీంతో పట్టణ రూపురేఖలు మారుతాయనుకున్నారు. శాటిలైట్ కింద ఒక అండర్ డ్రైనేజీ పనులు మినహా ఏ పనికాలేదు. శాటిలైట్ డేటాతో రెండో సారి ప్లాన్ తయారు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆమోదం రావడం లేదు. దీంతో అధికారులు పాత ప్లాన్లనే అమలు చేస్తున్నారు. ఈ కారణంగా భవిష్యత్తులో రహదారుల విస్తరణ, ప్రధాన రోడ్లలో ట్రాఫిక్, పార్కింగ్, ఇండస్ట్రియల్ కారిడార్, జోన్‌ల ఏర్పాటు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

రింగు రోడ్డు కలేనా?

వికారాబాద్ పట్టణానికి రింగ్ రోడ్డు అవసరమనే విషయాన్ని రెండు దశాబ్దాల క్రితమే అధికారులు గుర్తించారు. ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ నాయకులు రింగ్ రోడ్డుపై హామీలు గుప్పిస్తున్నారు. కానీ నేటికీ ఆ కల నెరవేరడం లేదు. ఏడాదికి ఒకసారి రింగు రోడ్డు సర్వే అయ్యిందని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చారని, మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రింగ్ రోడ్డు నిర్మాణం త్వరలో ప్రారంభం కాబోతుందని నాయకులు ప్రచారం చేసుకోవడమే తప్ప కార్యరూపం దాల్చడంలేదు. బీఆర్‌ఎస్ మొదటి సారి అధికారంలోకి వచ్చిన సమయంలో వికారాబాద్‌కు రింగ్ రోడ్డు మంజూరు అయ్యిందని, ఆ మంజూరు అప్పటి మంత్రి మహేందర్ రెడ్డి తాండూరుకు తరలించారనే ప్రచారం జరిగింది. ఏదిఏమైనా దశాబ్దాలు గడుస్తున్నా జిల్లా కేంద్రం ప్రజలు రింగురోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూడక తప్పడం లేదు.

రోడ్లన్నీ అధ్వానం

జిల్లా కేంద్రంలో ఏ రోడ్డు చూసినా అధ్వానంగా కనిపిస్తోంది. ఆలంపల్లి ప్రధాన రోడ్డు, ఎన్టీఆర్ క్రాస్ రోడ్డు, బస్టాండ్ రోడ్డు, రామయ్య గూడ రోడ్డు, మహాశక్తి చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ రోడ్లు పూర్తి ఇరుకుగా ఉన్నాయి. రోడ్డు వెడల్పునకు అధికారులు అడుగులు వేసినా.. వ్యాపారులు పోటాపోటీగా కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకుంటున్నారు. బీజేఆర్, మహాశక్తి చౌరస్తాల్లో కనీసం ఆర్టీసీ బస్సులు తిరగడానికి అవకాశం లేకుండా పోతోంది. ప్రధాన రోడ్లకు ఇరువైపులా పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లను పెట్టడంతో వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బంది ఏర్పడుతోంది. రోడ్ల సమస్యను తీర్చేందుకు అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

రైల్వే బ్రిడ్జి కుంగితే ..

వికారాబాద్ పట్టణం చుట్టూ రైల్వే ట్రాక్ ఉంది. పట్టణంలోకి రావాలన్నా బయటకు వెళ్లాలన్నా రైల్వే బ్రిడ్జి మీదుగానే. ఈ బ్రిడ్జి మూడు దశాబ్దాల క్రితం నిర్మించింది కావడంతో ఇటీవల రెండు మూడు చోట్ల మట్టి కుంగిపోయింది. వెంటనే స్పందించిన అధికారులు మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. ఏ కారణం చేతనైనా బ్రిడ్జి మరమ్మతుకు నోచుకున్నా.. కుంగినా పట్టణంలోకి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఈ విషయం ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తెలిసినా ప్రత్యామ్నాయంపై శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా వెంచర్లు..

ప్లాన్ లేని కారణంగా మున్సిపల్ పరిధిలో రియల్ వ్యాపారులు ఇష్టానుసారంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌లో నివాస గృహాలు, పరిశ్రమలు, కార్యాలయాలు, వ్యాపార సముదాయల ప్రాంతాలను జోన్లుగా గుర్తిస్తారు. బఫర్ జోన్స్, రిక్రియేషన్ సెంటర్, బైపాస్ రోడ్లు నిర్మిస్తారు. ప్లాన్ అమలైతే ఏ వెంచర్ల నుంచి రింగ్ రోడ్డు, సబ్ రోడ్లు వెళ్తాయో తెలియదు. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసే సామాన్యులు నష్టపోయే అవకాశం ఉంది.

ఆమోదం పొందని మాస్టర్ ప్లాన్..

పట్టణం అభివృద్ధికి గతంలోనే మాస్టర్ ప్లాన్ ఉన్నా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరువాత 2014లో ఒక సారి, 2019లో మరోమారు మాస్టర్ ప్లాన్ వేయించారు. సుమారు పది మంది ప్రత్యేక సిబ్బంది వచ్చి పది రోజుల పాటు ఇక్కడే ఉండి పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా శాటిలైట్ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి డీటీసీపీ కార్యాలయంలో సమర్పించారు. ఇప్పటి వరకు ఆమోదం పొందలేదు. మాస్టర్ ప్లాన్ అమలు కాకపోవడం ఓ రకంగా పట్టణ అభివృద్ధికి ఆటంకంగా మారిందని చెప్పవచ్చు.

"అమలుకు సిద్ధంగా ఉన్నాం



మాస్టర్ ప్లాన్ ఉన్నతాధికారుల వద్ద రెడీగా ఉంది. అమలు చేయాలని ఆదేశాలు వస్తే చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కొత్త వెంచర్లకు, కొత్త నిర్మాణాలకు భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొనే అనుమతులు ఇస్తున్నాం.

– శరత్ చంద్ర, మున్సిపల్ కమిషనర్, వికారాబాద్

కొడంగల్ మున్సిపల్ బడ్జెట్ రూ.3.89 కోట్లు

- ఆమోదించిన కౌన్సిల్ సమావేశం
- ఆదాయం పెంచుకొని అభివృద్ధి సాధించాలి
- ప్రజా సమస్యలు పరిష్కరించాలి
- మున్సిపల్ పరిధిలో మొక్కలు నాటాలి
- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ దిశానిర్దేశం

కొడంగల్: మున్సిపల్ వార్షిక బడ్జెట్‌ను సోమవారం కౌన్సిల్ ఆమోదించింది. పట్టణంలోని వెటర్నరీ హాలులో మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ అధికారులు బడ్జెట్ పద్దులను సమావేశంలో ప్రవేశపెట్టారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సాధారణ అంచనా బడ్జెట్, గత ఏడాదికి సంబంధించి సవరణ బడ్జెట్ గురించి అధికారులు వివరించారు. వచ్చే ఏడాదిలో రూ.3.89 కోట్ల ఆదాయం ఉంటే అందులో రూ.3.76 కోట్ల ఖర్చు ఉంటుందని అధికారులు సూచించారు. 31 మార్చి 2024 నాటికి మున్సిపల్ ఖాతాలో రూ.13.40 లక్షల మిగులు బడ్జెట్ ఉంటుందని కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి సభకు వివరించారు. పురపాలక సంఘం ఆదాయం నుంచి జీతాలు, పారిశుద్ధ్యం, కరెంటు బిల్లులు, రుణ వాయిదాల చెల్లింపులు, హరితహారం పనుల నిర్వహణ ఉంటుందని కమిషనర్ చెప్పారు. పురపాలికలో విలీనమైన గ్రామాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాలు, మైనార్టీ వర్గాలు నివాసం ఉండే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. పార్కులు, వైకుంఠధామాల అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, సమీకృత సంతల అభివృద్ధి, డంపు యార్డుల నిర్వహణ తదితర పనులకు నిధుల కేటాయింపు జరుగుతుందన్నారు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్, న్యూ అసెస్‌మెంట్, రివిజన్, నల్లబిల్లులు, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ, పట్టణ ప్రగతి నిధుల ద్వారా ఆదాయ వనరులు సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. ఉద్యోగుల జీతాలు, నీటి సరఫరా ఖర్చు, కరెంటు బిల్లు, బోర్ల రిపేరు, డంపింగ్ యార్డు నిర్వహణ, ఇతర ఖర్చులు పెరిగినట్లు తెలిపారు. ఆదాయంలో నుంచి ఖర్చులు భరిస్తున్నట్లు తెలిపారు.

అధికారుల దృష్టికి సమస్యలు

ఈ సందర్భంగా పలువురు సభ్యులు వారి వార్డుల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పాత కొడంగల్, తండాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ శంకర్ నాయక్ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనుబంధ గ్రామాల్లో పన్నుల భారాన్ని ప్రజలు మోయలేకపోతున్నారని గుండ్లకుంట కౌన్సిలర్ బీఎం రమేశ్ అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆదాయం పెంచుకొని అభివృద్ధి సాధించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందుండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, రమేశ్, శంకర్‌నాయక్, డాక్టర్ శ్రీలత, సాయిప్రసన్న, సరోజ, కో ఆప్షన్ సభ్యులు మునీర్, మున్సిపల్ డీఈ గంగాధర్, ఏఈ ఖాజా, మున్సిపల్ సిబ్బంది క్రాంతి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వచ్చే నెల 3 నుంచి ప్రారంభం
- జిల్లాలో 74 పరీక్షా కేంద్రాలు
- డీఈఓ రేణుకాదేవి వెల్లడి



జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

వికారాబాద్ అర్బన్: టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యా.ధికారి రేణుకాదేవి తెలిపారు.వచ్చే నెల 3 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 74 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 13,727 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుందన్నారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, కాంపోజిట్ తెలుగు కోర్సు రాసే విద్యార్థులకు మరో 20 నిమిషాల సమయం అదనంగా ఉంటుందన్నారు. 5 నిమిషాల ఆలస్యంగా మాత్రమే పరీక్ష హాలులోకి అనుమతించడం జరుగుతుందని డీఈఓ తెలిపారు.ఇప్పటికే హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లోఉంచామన్నారు. విద్యార్థులు వారి పరీక్ష కేంద్రాలను ముందుగానే తెలుసుకొని గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 08416–235245 ను సంప్రదించాలన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

పరిగి: ధరణి సమస్యల వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ న్యూ డెమొక్రసి డివిజన్ కార్యదర్శి మల్లేశ్ అన్నారు. ఈ మేరకు సోమవారం సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి వల్ల చాలా మందికి అక్రమంగా భూములు వచ్చాయని, వాటి వల్ల నిజమైన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధరణిలో జరిగిన పొరపాట్లవల్లే ఇలా జరిగిందన్నారు. భూమిని దున్ని వ్యవసాయం చేస్తున్న రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బసిరెడ్డి, శికు మార్, శ్రీశైలం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజవాణిలో ప్రజల నుంచి 288 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయా మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిత్ గంగ్వార్, జిల్లా రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

డబుల్ బెడ్రూంల కోసం జోరుగా దరఖాస్తులు



దరఖాస్తు చేసుకొనేందుకు బారులుతీరిన ప్రజలు

తాండూరు: మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో రెవెన్యూ అధికారులు ఆరు చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేయగా అర్హులైన ప్రజలు దరఖాస్తులు అందజేస్తున్నారు. మొదటి రోజు 2,196 దర ఖాస్తులు అందాయని తహసీల్దార్ చిన్నప్పలనాయుడు తెలిపారు. ఇందిరానగర్ బస్తీ దవాఖానలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 450, కొత్త మున్సిపల్ కార్యాలయంలో 372, పాత తాండూరు బస్తీదవాఖానలో 350, రైతుబజార్ కేంద్రంలో 471, పాత మున్సిపల్‌లోని 1వ కౌంటర్‌లో 240, రెండో కౌంటర్‌లో 313 దరఖాస్తులు అందాయన్నారు.

'ధ్వజ'మెత్తిన భక్తకోటి

- దామస్తాపూర్‌లో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు
- హాజరైన ఆయా పార్టీల నాయకులు

మర్పల్లి: దామస్తాపూర్‌లో ఆంజనేయ స్వామి ధ్వజ స్తంభ ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోమాలు చేపట్టారు. ఆలయంలో నవగ్రహాల ప్రతిష్ఠాపన, శివలింగం, ఒంటె విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఉత్సవాల ముగింపు రోజున ఆలయాన్ని నిర్మించిన పి.రాధ, జగన్నాథరెడ్డి దంపతులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ జెడ్పీటీసీ మధుకర్‌తో హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కల్‌ఖోడ సర్పంచ్ శివకుమార్, నాయకులు గోపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులు కార్యకర్తలు ఉన్నారు. ఈ ఉత్సవాలలో స్థానిక సర్పంచ్ జైపాల్ రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, పాండురంగారెడ్డి, శాంతప్ప, ఉత్సవ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, మొగిలిరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, పట్లోళ్ల మల్లారెడ్డి, బాబురెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమాలను తిలకిస్తున్న భక్తజనం

క్లుప్తంగా

నేడు తైబజార్‌కు వేలం

బంట్వారం: మండలంలోని కోట్‌పల్లి తైబజార్‌కు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 9 అంశాలకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. వేలం నిర్వహణపై సర్వ హక్కులు గ్రామ పంచాయతీకి ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల వారు రూ. 5 వేలు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొన వచ్చని ఆయన సూచించారు.

'కల్యాణలక్ష్మి' పేదలకు వరం

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. సోమవారం మండలంలోని ధామస్తాపూర్‌లో సర్పంచ్ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కుల్కచర్ల: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరి కథనం మేరకు.. కుల్కచర్లకు చెందిన వీ చుక్కమ్మ(24) ఈ నెల 13న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. భర్త రాములు వల్లే చుక్కమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆయనపై కేసు నమోదు చేశారు. మృతురాలి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు రాములును అరెస్టు చేసి పరిగి జైలుకు తరలించారు.

బైక్, వ్యాన్ ఢీ

ఇంటర్ విద్యార్థులకు తీవ్ర గాయాలు

బషీరాబాద్: ఎదురెదురుగా వచ్చిన బైక్ వ్యాన్ ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు ఇంటర్ విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని రెడ్డిఘణపూర్‌కు చెందిన తేజగౌడ్, ప్రసాద్, బషీరాబాద్‌కు చెందిన రషీద్ తాండూరులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. బోజ్యానాయక్ తండా నుంచి వస్తున్న వ్యాన్ కాశీంపూర్ గేటు వద్ద బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు కాళ్లు విరిగాయి. అటుగా వచ్చిన టీఆర్‌ఎస్ నాయకుడు ఎం సురేష్ పోలీసులకు సమాచరం ఇచ్చారు. ఎస్‌ఐ విద్యాచరణరెడ్డి, సీఐ రాంబాబు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన విద్యార్థులను 108లో ఆస్పత్రికి తరలించారు. సురేష్‌ను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడిగా డేవిడ్

తాండూరు టౌన్: బీఆర్‌ఎస్ యువజన విభాగం తాండూరు పట్టణ అధ్యక్షుడిగా డేవిడ్ లివింగ్‌స్టన్‌ను నియమించారు. సోమవారం ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, యంగ్ లీడర్స్ విభాగంలో చురుగ్గా పనిచేసిన తనకు పట్టణ అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ చారి, పార్టీ అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ఏబీనైజర్ పాల్గొన్నారు.



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



చందనలేపనంలో ఉత్సవమూర్తులు

చక్రస్నానం సర్వపాప హరణం

భక్తిశ్రద్ధలతో ధ్వజ అవరోహణం

- ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం

కొడంగల్: పట్టణంలోని బాలాజీ నగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం దేవేరుల సమేత మలయప్ప స్వామికి చక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా చివరి రోజు స్వామివారికి చక్రస్నానం నిర్వహించడం ఇక్కడి ఆచారం. తిరుమల నుంచి వచ్చిన అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వరహ స్వామి ఆలయ ఆవరణలో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం శ్రీవారికి కోనేరులో చక్రస్నానం నిర్వహించారు. టీటీడీ డిప్యూటీ ఈవో తన బృందంతో వచ్చి స్వామివారికి పట్టు వస్త్రాలు, శేష వస్త్రాన్ని సమర్పించారు. అర్చకులు, ధర్మకర్తలు ఆయనకు స్వాగతం పలికి ఆలయ అతిథి మర్యాదలు చేశారు. 50 ఏళ్లుగా తిరుమల నుంచి అధికారికంగా పట్టు వస్త్రాలు, శేష వస్త్రాన్ని కొడంగల్‌కు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించడం ఈ ఆలయం ప్రత్యేకత. ఆదివారం రాత్రి అశ్వ వాహనంపై వీధి ఉత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజ అవరోహణం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 19వ తేదీ ఎగుర వేసిన ధ్వజాన్ని సోమవారం రాత్రి కిందకు దింపారు. ఆలయ ఆవరణలో జరిగిన ధ్వజ అవరోహణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భూదేవి శ్రీదేవి సమేత శ్రీనివాసుడు సీతారామ లక్ష్మణుల అవతారంతో తిరుచ్చి వాహనంపై ఊరేగారు. తిరుచ్చి వాహనం ముందు విష్వక్సేనుడు, చక్రతాల్వార్‌లు దేవాలయ ప్రదక్షిణ చేస్తూ ధ్వజ స్తంభం వరకు వచ్చారు. ఆలయ అర్చకులు ధ్వజ స్తంభానికి విశేష పూజలు చేశారు. యాగశాల నుంచి పూర్ణకుంభం తెచ్చి శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆవాహణం చేశారు. దీంతో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు అర్చకులు తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవం

కొడంగల్‌లో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు 10 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

వీధి నాటకాలను ప్రోత్సహిద్దాం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

దోమ: ప్రాచీన చరిత్రకు దర్పణం వీధి నాటకాలని, వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి దోమ మండలం బడేంపల్లిలో గ్రామ కళాకారులు భక్తి సిరియాల నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకాన్ని మనోహర్‌రెడ్డి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన కళాకారులు వీధి నాటకాలు నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రాచీన కళలను కొనసాగించడం అభినందనీయమన్నారు. అనంతరం కళాకారులకు రూ. 30 వేల ఆర్థిక సహాయం అందజేశారు.



కళాకారులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పూడూరు: శిథిలావస్థకు చేరిన ఆలయాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాకంచర్ల యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం శిథిలావస్థకు చేరిన చేరడంతో పునఃనిర్మాణం కోసం సోమవారం భూమి పూజ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని పురాతన ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ నుంచి రూ. 50లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహా ముదిరాజ్, సర్పంచ్ కమ్లీబాయి, జెడ్పీటీసీ మేఘమాల, ఎంపీపీ మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, ఆలయ ఈఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో ప్రశాంతత

తాండూరు: నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సద్గురు పొట్లి మహరాజ్ ఆలయ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ టీ.భానుకుమార్, కార్యవర్గ సభ్యులు డి.చంద్రశేకర్, ప్రశాంత్‌గౌడ్, సునిత, నరేందర్‌గౌడ్, గుండప్ప, సిద్దరామప్ప, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా అనంతభట్టుతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సీ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పీ దీప, మున్సిపల్ కౌన్సిలర్ సింధుజగౌడ్, నగరేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కే మురళీధర్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, పీ నర్సింహులు, జీ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



తాండూరు: ఆలయ కమిటీ నూతన సభ్యులతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

కేంద్రం కుట్రలకు భయపడేది లేదు

- రాహుల్‌గాంధీకి అండగా ఉంటాం
- మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

అనంతగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై ఎన్ని కుట్రలు పన్నినా భయపడేది లేదని, తామంతా అండగా ఉంటామని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై ఎన్ని కుట్రలు చేసినా శాంతియుత పద్ధతిలో తిప్పి కొడతామన్నారు. బీజేపీ కుట్రలను ఎండగడతామన్నారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబం వారిదన్నారు. రాహుల్‌గాంధీ పాదయాత్రకు వచ్చిన ప్రజాదరణను చూసి ఓర్వలేక ఇలాంటి కుట్రపూరిత పనులు చేయడం బీజేపీకి ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల చేతుల్లో కీలుబొమ్మగా మారిందని మండిపడ్డారు. అదానీ అవినీతిని పార్లమెంట్‌లో ప్రశ్నిస్తున్నందుకే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సైతం నియంత పాలన సాగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, ఎంపీపీ చంద్రకళ, తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ మహరాజ్ మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, కౌన్సిలర్ మురళి, మండల కోఆప్షన్ సభ్యుడు జాఫర్, సీనియర్ నాయకులు నర్సింలు, అనంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

అదృశ్యమై.. బావిలో శవమై..

- 5 రోజుల తర్వాత వెలుగులోకి
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

బషీరాబాద్: ఉగాది పండుగ రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు 5 రోజుల తర్వాత బావిలో శవమై కనిపించాడు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం మేరకు.. పర్వత్‌పల్లికి చెందిన కే శంకరప్ప, నర్సమ్మ దంపతుల పెద్ద కొడుకు నవీన్‌కుమార్(20) ఈ నెల 22న మైసమ్మ ఆలయానికి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో 23వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గ్రామ శివారులోని ఓ బావిలో యువకుడి మృతదేహాన్ని చూసిన పశువుల కాపర్లు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, సీఐ రాంబాబు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నవీన్ మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో అదృశ్యమైన రోజే చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా తమ కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి శంకరప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకున్నారు.



నవీన్(ఫైల్)

మహిళల ఉన్నతిలో వీవోఏల పాత్ర కీలకం



సమీక్షలో పాల్గొన్న వీవోఏలు, సంఘం జిల్లా కార్యదర్శి రూప్లనాయక్

సంఘం జిల్లా కార్యదర్శి రూప్ల నాయక్

కుల్కచర్ల: మహిళల అభ్యున్నతిలో వీవోఏల పాత్ర ఎంతో కీలకమని వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి రూప్ల నాయక్ అన్నారు. సోమవారం కుల్కచర్లలో వీవోఏల మండల కమిటీ ఎన్నిక, సంఘం విధివిధానాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించడం, ఆర్థిక పరమైన అవగాహన కల్పించడంపై జరుగుతోందన్నారు. వీవోఏలకు కనీస వేతనం రూ. 15వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా జీతాలు చెల్లించాలన్నారు. బీమా మొత్తాన్ని రూ. 5లక్షలకు పెంచాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా జె.లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మొగులయ్య, కోశాధికారిగా శివరాములు, కార్యదర్శిగా లలిత, సలహాదారులుగా నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తుది దశకు చించల్‌పేట బ్రిడ్జి

- ఎమ్మెల్యే చొరవతో పనుల్లో వేగం
- నెల రోజుల్లో అందుబాటులోకి
- తగ్గనున్న దూరాభారం
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు



చించల్‌పేట వద్ద మూసీ నదిపై నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి

నవాబుపేట: మండల ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణ.. చిరకాల వాంఛ ఎట్టకేలకు నెరవేరుతోంది. ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవతో మూసీ నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వారానికి ఒక్క సారి ఈ పనులను ఎమ్మెల్యే పర్యవేక్షిస్తున్నారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే మండల ప్రజలకు దూరాభారం తగ్గనుంది. రైల్వే ట్రాక్, మూసీ నదికి ఇరువైపులా ఏడు గ్రామాలు ఉంటాయి. ఈ గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే రెండు చోట్ల నుంచి మాత్రమే వీలుంటుంది. మూసీ నది మండలంలో దాదాపు 18 కిలో మీటర్ల మేర ప్రవహిస్తుంది. అలాగే ఈ నది పొడవునా 19 కిలో మీటర్ల మేర రైల్వే ట్రాక్ ఉంది. కేవలం గంగ్యాడ గ్రామం వద్ద మాత్రమే మూసీ నదిపై బ్రిడ్జి ఉంది. గొల్లగూడ రైల్వేస్టేషన్ వద్ద ఒక్క చోట మాత్రమే రాకపోకలను గేటు ఉంది. మూసీ, రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఏడు గ్రామాలు ఉంటాయి. మండలంలో మొత్తం 32 గ్రామ పంచాయతీలు, రెండు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఈ ఏడు గ్రామాల ప్రజలు మండల కేంద్రంతో పాటు మిగిలిన 27 గ్రామాలకు వెళ్లాలన్నా.. ఆ గ్రామాల ప్రజలు ఈ గ్రామాలకు రావాలన్నా ప్రస్తుతం ఉన్న గొల్లగూడ రైల్వే గేటు, గంగ్యాడ వద్ద ఉన్న మూసీ నదిపై ఉన్న బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించాలి.

ఏడాది క్రితం బ్రిడ్జి మంజూరు

ఏడాది క్రితం మూసీ నదిపై చించల్‌పేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3.5 కోట్లు మంజూరయ్యాయి. ఒక వైపు రైల్వే ట్రాక్, మరో వైపు రైతుల పొలాలు ఉండడంతో పనులు ప్రారంభం కాలేదు. ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవ తీసుకొని రైల్వే అధికారులు, రైతులతో మాట్లాడి పనులు జరిగేలా చూశారు. దీంతో నాలుగు నెలల క్రితం బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయి. చించల్‌పేట గ్రామంతో పాటు అక్నాపూర్, అత్తాపూర్, పులుసుమామిడి, పీరంపల్లి, పాతూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి, అలాగే చిట్టిగడ్డ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే మూసీ నది దాటాల్సిందే. ఈ నది వర్షాకాలం మొదలుకొని జనవరి వరకు పారుతుంది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయేవి. వర్షాకాలం 6 నెలల పాటు మండల కేంద్రానికి వెళ్లాలంటే వికారాబాద్ నుంచి అదనంగా 20 కిలోమీటర్లు ప్రయాణించక తప్పదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మండల ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి.

నెల రోజుల్లో అందుబాటులోకి

చించల్‌పేట వద్ద మూసీ నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఒక పక్క రైతుల భూమి విషయమై క్లియరెన్స్ రావాల్సి ఉంది. అది ఎంత త్వరగా వస్తే బ్రిడ్జి నిర్మాణం అంత త్వరగా పూర్తవుతుంది. నెల రోజుల్లో బ్రిడ్జి అందుబాటులోకి తెస్తాం.

– మాధవరెడ్డి, డీఈ, పంచాయతీరాజ్, వికారాబాద్

తాండూరు అభివృద్ధి పట్టదా?

- వర్గ పోరుతో పరిష్కారం కాని సమస్యలు
- బీజేపీ నేత మురళీకృష్ణ గౌడ్
- పట్టణంలో తాండూరు గోస – బీజేపీ భరోసా దీక్ష

తాండూరు టౌన్: ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలే తాండూరు అభివృద్ధికి శాపంగా మారారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్ అన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై తాండూరు గోస – బీజేపీ భరోసా పేరుతో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ నేతృత్వంలో స్థానిక అంబేడ్కర్ చౌక్ వద్ద ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో వర్గ విభేదాల వల్లే తాండూరు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలు తీర్చాలనే ధ్యాస లేకుండా పోయిందని, ఆధిపత్యం కోసం అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్ పరిధిలోని ఒక్కో వార్డుకు రూ. కోటి నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ఎమ్మెల్యే, ఆ హామీ ఏమైందని నిలదీశారు. వెంటనే నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల వర్గ పోరుతో కొత్త కమిషనర్‌గా బాధ్యతలు తీసుకునేందుకు జంకుతున్నారని అన్నారు. కేటీఆర్ మాకు చాలా సన్నిహితుడు అని గొప్పలు చెప్పుకునే నేతలు, పురపాలక మంత్రిగా ఉన్న ఆయనతో మాట్లాడి నిధులు మంజూరు చేయించాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు కోటలు దాటుతున్నా, అభివృద్ధి మాత్రం గడప దాటడం లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల వార్డుల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టామని, ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారన్నారు. ఆసరా పింఛన్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, దోమలు, కుక్కల నివారణ వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు, మిషన్ భగీరథ నీరు, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు, ట్రాఫిక్ సిగ్నల్స్ మరమ్మతులు, మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ వంటి అనేక సమస్యలపై ప్రజలు విన్నవించారని తెలిపారు. తాండూరు పట్టణ అభివృద్ధిపై దృష్టి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సారించాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రావు, కౌన్సిలర్లు శ్రీలత, లావణ్య, చంద్రశేఖర్, జహీర్ అబ్బాస్, ప్రహ్లాద రావు, రాంచందర్, ప్రకాష్, టీ నరేష్, సంజీవ్, మల్లేశం, భద్రేశ్వర్, పటేల్ విజయ్, పూజారి పాండు తదితరులు పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రుణాల మంజూరులో అక్రమాలపై విచారణ

వివరాలు సేకరించిన అడిషనల్ పీడీ నర్సింలు, డీపీఎం వీరయ్య

దౌల్తాబాద్: మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామ ఐకేపీ బుక్‌కీపర్ రామకృష్ణారెడ్డి అవినీతిపై సోమవారం డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నర్సింలు, డీపీఎం వీరయ్య విచారణ చేపట్టారు. గ్రామంలోని మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు మంజూరు చేయిస్తానని ఒక్కో సంఘం నుంచి రూ. 2వేల నుంచి రూ.7వేల వరకు వసూలు చేశారు. దీనిపై ఇటీవల గ్రామస్తులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టాలని కలెక్టర్.. అడిషనల్ పీడీని ఆదేశించారు. దీంతో సోమవారం సంఘాల సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. రుణాల మంజూరుకు తాము డబ్బులు ఇచ్చినట్లు సంఘం సభ్యులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని కలెక్టరుకు నివేదిస్తామని అడిషనల్ పీడీ తెలిపారు. ఇకపై రుణాల మంజూరుకు ఎలాంటి డబ్బులు ఇవ్వవద్దని సభ్యులకు సూచించారు. సంఘాల బలోపేతానికి ఐకేపీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని, ఎలాంటి వసూళ్లకు అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుక్‌కీపర్ వద్ద తీసుకున్న డబ్బులు రికవరీ చేయిస్తామని తెలిపారు.



మహిళా సంఘాల సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న అడిషనల్ పీడీ నర్సింలు